


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | గురువారం 30-07-2026 | సంపుటి - 31 | సంచిక - 66 | రూ : 4 | పేజీలు: 8




### హోం శాఖలో
## కొలువుల జాతర

- 7,437 పోస్టుల భర్తీకి 4 నోటిఫికేషన్లు జారీ
- త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

హైదరాబాద్: తెలంగాణ హోంశాఖలో మరోసారి కొలువుల జాతర మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నోటిఫికేషన్‌లు జారీ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖలకు సంబంధించి వేర్వేరుగా నాలుగు ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో కానిస్టేబుల్, ఆ స్థాయి పోస్టులే దాదాపు 7 వేలు ఉండటం ప్రాధాన్యం సంతరించుకొంది. అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ (www.tgprb.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుల స్వీకరణ తేదీని ఇంకా ప్రకటించలేదు. దరఖాస్తు ప్రొఫార్మాను త్వరలోనే వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు వెల్లడించారు తరువాయి 2లో

### 45 రోజులకోసారి
## తప్పనిసరిగా సమన్వయ కమిటీ సమావేశం

**ప్రభుత్వానికి, పార్టీకి మధ్య అంతరం లేకుండా చూడాలి**



- 2 లేదా 3 జిల్లాల డీసీసీ అధ్యక్షుల మార్పు
- ఢిల్లీ సమావేశంలో నిర్ణయం
- భేటీలో పాల్గొన్న సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు

ఢిల్లీ, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మధ్య సమన్వయం కోసం ఏర్పాటు చేసిన కమిటీ 45 రోజులకొకసారి తప్పనిసరిగా సమావేశం కావాలని ఏఐసీసీ ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని తప్పనిసరిగా మంత్రులు పర్యవేక్షించాలని, ఈ ప్రక్రియ సరిగా జరుగుతుందా లేదా అనేది సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించి లోపాలుంటే సరిదిద్దాలని నిర్దేశించింది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూడటానికి ఈ కమిటీ సమావేశాలే కీలకమని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. బుధవారం ఆమె అధ్యక్షతన ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ తరువాయి 2లో

## బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించడం దేశ వ్యతిరేకం కాదు



- ఇద్దరు ఎస్డీపీఐ నేతలపై విధించిన నగర బహిష్కరణ ఉత్తర్వులు రద్దు
- భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం దేశ ద్రోహం ఎలా అవుతుందని కోర్టు ప్రశ్న
- ప్రభుత్వ వాదనలకు ఆధారం చూపలేదన్న హైకోర్టు

2లో



## కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక
## రూ.12,207 కోట్ల డివిడెండ్

- యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2,853 కోట్లు
- న్యూ ఇండియా అష్యూరెన్స్ నుంచి రూ.211 కోట్లు
- పీఎస్‌బీల జీఎన్‌పీఏ 1.9 శాతానికి తగ్గుదల
- ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు తరువాయి 2లో

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..
### లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి



ఢిల్లీ : దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
## ఆగస్టు 17 నుంచి విశాఖలో కొత్త సేవలు

- విశాఖపట్నం సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన కార్యకలాపాలకు ముగింపు
- కొత్త విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం
- ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రికార్డు స్థాయిలో 31 నెలల్లోనే పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్



విశాఖపట్నం విమానయాన చరిత్రలో ఒక శకం ముగిసి, కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఆగస్టు 17వ తేదీ నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య విమాన సర్వీసులు పూర్తిగా నిలిచిపోనున్నాయి. వాటి స్థానంలో విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన తరువాయి 2లో

### రూ.కోటి రివార్డు ఉన్న మావోయిస్టు
## అగ్ర నేత మిసిర్ బేస్రా అరెస్ట్

- అదుపులోకి మరో ఇద్దరు కీలక మావోయిస్టు నేతలు
- ఝార్ఖండ్-సీఆర్‌పీఎఫ్-కోబ్రా సంయుక్త ఆపరేషన్
- లొంగిపోయిన కేడర్ సమాచారంతో ఆపరేషన్
- 150కు పైగా కేసులున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు బేస్రా

2లో



# 45 రోజులకోసారి తప్పనిసరిగా సమన్వయ కమిటీ సమావేశం

దిల్లీ, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మధ్య సమన్వయం కోసం ఏర్పాటు చేసిన కమిటీ 45 రోజులకొకసారి తప్పనిసరిగా సమావేశం కావాలని ఏఐసీసీ ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని తప్పనిసరిగా మంత్రులు పర్యవేక్షించాలని, ఈ ప్రక్రియ సరిగా జరుగుతుందా లేదా అనేది సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించి లోపాలుంటే సరిదిద్దాలని నిర్దేశించింది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూడటానికి ఈ కమిటీ సమావేశాలే కీలకమని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. బుధవారం ఆమె అధ్యక్షతన దిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా హాజరై అనేక అంశాలపై మాట్లాడతారని తొలుత చెప్పారు. లోక్‌సభలో కీలకమైన చర్చలున్నందున ఆయన రాలేదని పార్టీ వర్గాలు వివరించాయి. ఏఐసీసీ అభిప్రాయాలను మీనాక్షి వివరించినట్లు సమాచారం. సరిగా పనిచేయని 2 లేదా 3 జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులను మార్చాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. డీసీసీ అధ్యక్షులకు పార్టీ ప్రొటోకాల్ ప్రకారం నేతలంతా గౌరవం ఇచ్చేలా చూడాలని నిర్ణయించారు. సర్ వచ్చే నెల 3న ముగియనుందని, ఆ తరవాతే నామినేటెడ్ పదవుల భర్తీపై ఏఐసీసీ దృష్టిసారిస్తుందని నేతలు తెలిపారు. ఈ పదవులకు ఎవరు అర్హులనే జాబితాలను ఏఐసీసీకి పంపాలని పీసీసీకి సూచించారు. కార్పొరేషన్ ఛైర్మన్లుగా పనిచేసినవారిలో పార్టీకోసం కష్టపడనివారిని పక్కనపెట్టనున్నారని తెలుస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో వర్గాలుగా ఏర్పడి బహిరంగ విమర్శలు చేస్తున్నవారితో చర్చించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, పీసీసీ తీసుకోవాలని ఈ సమావేశంలో సూచించారు. ఉదయం 11.10 గంటల నుంచి మధ్యాహ్నం 12.20 గంటల వరకు సమావేశం జరగ్గా అనంతరం మహేశ్‌కుమార్, భట్టి, ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు.

# హోం శాఖలో కొలువుల జాతర

హైదరాబాద్: తెలంగాణ హోంశాఖలో మరోసారి కొలువుల జాతర మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నోటిఫికేషన్‌లు జారీ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖలకు సంబంధించి వేర్వేరుగా నాలుగు ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో కానిస్టేబుల్, ఆ స్థాయి పోస్టులే దాదాపు 7 వేలు ఉండటం ప్రాధాన్యం సంతరించుకొంది. అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ (www.tgprb.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుల స్వీకరణ తేదీని ఇంకా ప్రకటించలేదు. దరఖాస్తు ప్రొఫార్మాను త్వరలోనే వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు వెల్లడించారు. అభ్యర్థులు శారీరక, వైద్య ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

* **ఇవీ సమకూర్చుకోవాల్సిన ధ్రువీకరణపత్రాలు...**

> ఆన్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలు చేసే ముందే తెలంగాణలో స్థానికులైన అభ్యర్థులు కొన్ని ధ్రువపత్రాలను సమకూర్చుకోవాలని మండలి సూచించింది.

> ఎస్సీ అభ్యర్థులు... ఎస్సీ గ్రూప్ 1, 2, 3 ఉపవర్గీకరణతో కూడిన తాజా సామాజిక ధ్రువపత్రం.

> ఎస్టీ అభ్యర్థులు తమ కులం సర్టిఫికెట్.

> ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా బలహీనవర్గాలు) అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ప్రభుత్వం నుంచి పొందిన ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రం...

> బీసీ అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న నాన్‌క్రీమీలేయర్ సర్టిఫికెట్...

> అభ్యర్థులంతా 17 తరగతుల వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు లేదంటే నివాస ధ్రువీకరణపత్రం(రెండింటిలో ఏవి వర్తిస్తే అవి).

> దివ్యాంగ, స్పోర్ట్స్ తదితర ప్రత్యేక కేటగిరీల కింద అర్హులైతే సంబంధిత ధ్రువపత్రాలు.

**అగ్నిమాపకశాఖలో ఖాళీలు ఇలా......**

> స్టేషన్ ఫైర్ ఆఫీసర్: 39

> ఫైర్ ఫైటర్: 751

**> జైళ్ల శాఖలో..**

> డిప్యూటీ జైలర్(పురుషులు): 14

> డిప్యూటీ జైలర్(మహిళలు): 1

> వార్డర్(పురుషులు): 196

> వార్డర్(మహిళలు): 12

**> ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్)లో..**

> ఎస్సై: 44

> కానిస్టేబుల్: 1,380

**పోలీస్ శాఖలో ఖాళీలు ఇలా...**

| | |
|---|---|
| ■ సివిల్ ఎస్సై | :148 |
| ■ ఏఆర్ ఎస్సై | : 14 |
| ■ టీజీఎస్పీ ఏఆర్ఎస్సై | : 12 |
| ■ ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై | : 3 |
| ■ ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై | : 23 |
| ■ సివిల్ కానిస్టేబుల్ | :3,697 |
| ■ ఏఆర్ కానిస్టేబుల్ | :1,052 |
| ■ ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్ | : 24 |
| ■ కానిస్టేబుల్(డ్రైవర్) పీటీవో | : 20 |
| ■ కానిస్టేబుల్(మెకానిక్) పీటీవో | : 7 |

# కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

(మొదటిపేజీ తరువాయి)

నెలకొల్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 202526లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 202526లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది.

మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది. ప్రతి ప్రభుత్వ రంగ బ్యాంకు 90 శాతానికి పైగా ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియోను కొనసాగించింది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థమైన రిస్క్ మేనేజ్‌మెంట్

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం.. ఆగస్టు 17 నుంచి విశాఖలో కొత్త సేవలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టు 17వ తేదీ అర్ధరాత్రి 00.01 గంటల నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య కార్యకలాపాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అదే సమయం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (INS డేగా)లోని సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన సేవలు ఆగిపోతాయి. అయితే, జాతీయ అత్యవసర సమయాల్లో, భారత వాయుసేన, ఇతర సాయుధ దళాలు, పోలీసు విభాగాలు, ప్రభుత్వ వీఐపీ విమానాల రాకపోకలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయ కోడ్ "VTZ"ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. ఈ నూతన విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దాదాపు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే, కేవలం 31 నెలల్లో దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులన్నీ లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాలు విమానాశ్రయానికి, మిగిలినవి ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీలకు కేటాయించారు. బోయింగ్ 777, డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ A330 వంటి భారీ విమానాలు సైతం సులభంగా దిగేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, స్మార్ట్ సర్వైలెన్స్ వంటి సాంకేతికతలతో ప్రయాణికులకు

## రూ.కోటి రివార్డు ఉన్న మావోయిస్టు.. అగ్ర నేత మిసిర్ బేస్రా అరెస్ట్

దేశంలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందిన సీపీఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బేస్రా ఎట్టకేలకు భద్రతా బలగాలకు చిక్కాడు. ఆయన తలపై రూ.1 కోటి రివార్డు ఉండడం గమనార్హం. ఝార్ఖండ్‌లో జరిగిన సంయుక్త ఆపరేషన్‌లో ఆయనతో పాటు మరో ఇద్దరు కీలక మావోయిస్టు నాయకులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. మావోయిస్టు వ్యతిరేక పోరులో ఇది అత్యంత కీలక విజయాల్లో ఒకటిగా భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. అధికారుల వివరాల ప్రకారం..మంగళవారం అర్ధరాత్రి ఝార్ఖండ్ పోలీసులు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), కోబ్రా బెటాలియన్ సంయుక్తంగా ధన్‌బాద్, గిరిడిహ్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. మిసిర్ బేస్రా సంచారంపై అందిన నిఘా సమాచారంతో ఉచ్చు వేసిన బలగాలు ఆయన్ను అదుపులోకి తీసుకున్నాయి. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు రీజినల్ కమిటీ సభ్యులు మెహనత్ అలియాస్ మొచ్చు, విభీషణ్ ముర్ము, గౌరవ్ అలియాస్ సౌరభ్‌లను కూడా అరెస్ట్ చేశారు. వీరిద్దరి తలపై చెరో రూ.15 లక్షల రివార్డు ఉంది. ఈ ముగ్గురితో పాటు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వారికి మావోయిస్టు సంస్థతో ఉన్న సంబంధాలపై విచారణ కొనసాగుతోంది. అరెస్టయిన నేతల నుంచి సంస్థ కార్యకలాపాలు, ఆయుధాల నిల్వలు, నిధుల సమీకరణ మార్గాలు, వ్యూహాలు, కీలక అనుచరులపై సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. ఈ అరెస్టులకు ముందు రాంచీలో మంగళవారం 16 మంది మావోయిస్టు కేడర్ సభ్యులు అధికారుల ఎదుట లొంగిపోయారు. వారిలో మిసిర్ బేస్రాకు అత్యంత సన్నిహిత అంగరక్షకుడిగా పనిచేసిన దేవన్ ముర్ము అలియాస్ శనిచర్యా కూడా ఉన్నాడు. అతడి నుంచి లభించిన కీలక సమాచారమే ఈ ఆపరేషన్‌కు దారితీసినట్లు అధికారులు వెల్లడించారు. ఆ సమాచారంతో పక్కా ప్రణాళిక రూపొందించి మిసిర్ బేస్రాను పట్టుకున్నట్లు చెప్పారు. ఝార్ఖండ్‌లోని గిరిడిహ్ జిల్లా పిర్టాండ్ ప్రాంతానికి చెందిన మిసిర్ బేస్రా దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. భాస్కర్, సునిర్మల్, సాగర్ పేర్లతో కూడా ఆయన గుర్తింపు పొందాడు. క్రమంగా సీపీఐ (మావోయిస్టు) అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగాడు. ఝార్ఖండ్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో హత్యలు, భద్రతా బలగాలపై దాడులు, ఐఈడీ పేలుళ్లు, వసూళ్లు సహా 150కుపైగా కేసులు ఆయనపై నమోదైనట్లు సమాచారం. 2007లో ఖుంటీ పోలీసులు మిసిర్ బేస్రాను అరెస్ట్ చేసినా, 2009లో బిహార్‌లోని లఖిసరాయ్ కోర్టు సముదాయంపై మావోయిస్టులు దాడి చేసిన సమయంలో ఆయన పోలీసుల అదుపు నుంచి తప్పించుకున్నాడు. అప్పటి నుంచి దాదాపు

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి,

## బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించడం దేశ వ్యతిరేకం కాదు



అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేసి ఉండకూడదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం "దేశ వ్యతిరేక చర్య" కిందకు రాదని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ)కి చెందిన ఇద్దరు సభ్యులపై ముంబై పోలీసులు జారీ చేసిన నగర బహిష్కరణ ఉత్తర్వులను న్యాయస్థానం రద్దు చేసింది. ఎస్డీపీఐ కార్యకర్తలు ఫిరోజ్ అబ్దుల్ వహాబ్ ఖాన్, మహమ్మద్ రఫిక్ గులాం రసూల్ అన్సారీలను ఏడాది కాలం పాటు నగరం నుంచి బహిష్కరిస్తూ ముంబై పోలీసులు 2025 డిసెంబర్ 3న ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు, చెంబూర్‌గోవండి ప్రాంతంలోని సిమెంట్ గోడౌన్‌ల వల్ల కలుగుతున్న వాయు కాలుష్యం, బాబ్రీ మసీదు కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు సంబంధించి 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా పోలీసులు ఈ చర్య చేపట్టారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ మాధవ్ జమ్దార్, పోలీసుల చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "వారి దృక్పథం ప్రకారం, బాబ్రీ మసీదును కూల్చివేసి ఉండకూడదు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం. అది దేశ వ్యతిరేక చర్య ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే హక్కు ఉంది" అని జస్టిస్ జమ్దార్ వ్యాఖ్యానించారు. పిటిషనర్లపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ఒకటి ప్రతిపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంబంధించినదని, అందులో కాంగ్రెస్, శివసేన (యూబీటీ) కార్యకర్తలు కూడా పాల్గొన్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు గుర్తించింది. వారు చేసిన నినాదాలు సమాజంలో చీలికలు తెస్తాయన్న ప్రభుత్వ వాదనలకు ఎటువంటి ఆధారాలు చూపలేదని కోర్టు స్పష్టం చేసింది. కేవలం ఊహాజనిత భయాల ఆధారంగా పౌరుల ప్రాథమిక హక్కులను హరించలేమని, నగర బహిష్కరణ అనేది అసాధారణ చర్య

## ఆళ్లగడ్డలో ఏం జరిగినా సెన్సేషన్‌గా మారుతోంది : ఎమ్మెల్యే అఖిలప్రియ



అమరావతి: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఏ చిన్న వివాదం తలెత్తినా పార్టీ దృష్టికి తీసుకురావాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సూచించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే. దీనిపై అధిష్ఠానం వివరణ కోరిన నేపథ్యంలో పల్లా శ్రీనివాస్‌తో ఆమె భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో అఖిలప్రియ మాట్లాడారు. ''ఆళ్లగడ్డలో ఏం జరిగినా పెద్ద సెన్సేషన్‌గా మారుతోంది. నిజానిజాలు తెలియకుండా సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేస్తున్నారు. నేను చెప్పాలనుకున్న వాటిని పల్లా శ్రీనివాస్‌కు వివరించా. నియోజకవర్గంలోని వివాదాలు, సమస్యలపై పూర్తి స్పష్టత ఇచ్చా. నియోజకవర్గంలో ఏ చిన్న వివాదం తలెత్తినా చెప్పాలని ఆయన సూచించారు. నా తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, శోభ స్థాయికి ఎదగాలని.. వారి పేరు నిలబెట్టేలా పనిచేయాలన్నారు. పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. తెదేపా శ్రేణుల్లో అయోమయం ఉండకూడదనే పల్లా శ్రీనివాస్‌ను కలిశా'' అని భూమా

# భక్తిశ్రద్ధలతో మాణిక్యేశ్వరి మాత పుట్టినరోజు వేడుకలు




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : గంధంవారి గూడెంలోని ఆశ్రమంలో ఓంకార స్వరూపిణి శ్రీశ్రీశ్రీ జగద్గురు బాలయోగిని మాణిక్యేశ్వరి మాత జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, నల్లగొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆశ్రమ ప్రధాన కార్యదర్శి దేశ గంగాధర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాతగారి దివ్య పాదుకలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దత్తాత్రేయ స్వరూపిణిగా భక్తులు ఆరాధించే శ్రీశ్రీశ్రీ జగద్గురు బాలయోగిని మాణిక్యేశ్వరి మాత జీవితం, తపస్సు, ఆధ్యాత్మిక సేవలు భక్తులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాకర్ రావు, జగ్జీవన్ రెడ్డి, నాగిరెడ్డి, విశాల్, వెంకట్ రాములు, రాజు, విద్యాసాగర్, కంది సూర్యనారాయణ, గోవర్ధన్, చింత ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దేశ గంగాధర్ స్వామి మాట్లాడుతూ మాణిక్యేశ్వరి మాత దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని, భక్తులకు ఆధ్యాత్మిక మార్గంలో శాంతి, సద్బుద్ధి కలగాలని ఆకాంక్షించారు.

## గురువును గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయం

* షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : గురు పౌర్ణమి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డులోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సద్గురువులను స్మరించుకోవడంతో పాటు, సత్యం, ధర్మం, సేవా మార్గంలో నడవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కౌన్సిలర్లు రాజు నాయక్, బచ్చలి నరేష్, దిలీప్ కుమార్, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, శివ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు విజయ్ కుమార్‌తో పాటు ముబారక్ అలీఖాన్, కమ్మదనం సుధాకర్, వెంకట్ రాంరెడ్డి, శ్రీనివాస్, అమర్నాథ్ రెడ్డి, మహేందర్, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్, బీవీఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురు పూర్ణిమ వేడుకలు



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్లు జి.టి వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, బిక్షపతి, ప్రేమ్ కుమార్ గౌడ్, గుండు అశోక్, రాఘవేందర్ గౌడ్, పులిజాల నవీన్, వెంకటేష్, నవీన్, శ్రీకాంత్ తదితరులు సాయిబాబా భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## న్యూ పవర్ కుంగ్ అకాడమీ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్నగర్ పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కోచ్ అహ్మద్ ఖాన్ తన గురువైన బాలరాజ్ మాస్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ కోచ్ అహ్మద్ మాస్టర్, బాలరాజ్ మాస్టర్ ను ఘనంగా సన్మానించి వారి యొక్క గురుభక్తిని చాటుకున్నారు. గురువు ఎల్లప్పుడూ తన శిష్యులను ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించే వ్యక్తి గురువుగారని వారి యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్ టియు సి ఆధ్వర్యంలో జిఎం శాలెం రాజు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం సింగరేణి ఏరియా జి.ఎం ఆఫీస్ నందు జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవి విరమణ చేయుచున్న సందర్భంగా ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ఆధ్వర్యంలో ఐఎన్టియుసి సెంట్రల్, బ్రాంచ్, ఫిట్ ,ఆర్గనైజర్స్, ఇంచార్జ్ ల సమక్షంలో జిఎం శాలెం రాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ జిఎంగా గత మూడు నుండి సింగరేణి ప్రాంతాలకు అనేక సేవలు అందించారని , వారి శేష జీవితం సుఖ సంతోషాలతో కుటుంబ సమేతంగా ఆరోగ్యంగా ఉండాలని అయన ఆకాంక్షించారు. అనంతరం జిఎం మాట్లాడుతూ అందరి సహకారం మరువలేనిది అని , తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, రాజేశ్వరరావు, శ్రీనివాస్ విప్లవ్, భీముడు, నాగార్జన, సమ్మయ్య, అశోక్, కుమారస్వామి, రాజయ్య, ఎండి సత్తార్ పాష, మోహన్ తదితరులు పాల్గొన్నారు

## పారదర్శకతతో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలి

* ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కాంట్రాక్టర్లు, పర్యవేక్షణ అధికారులు పనుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా, పారదర్శకతతో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం వివిధ అభివృద్ధి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు శంకుస్థాపనలు చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల, సీసీ రోడ్ల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని , రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ భవనాల నిర్మాణంతో ప్రజల రవాణా సౌకర్యాలు, వసతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోసిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, పొలమూరి ధనలక్ష్మి, బోయిన విజయ్ కుమార్, సుప్రియ , స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు .

## గ్రామ పంచాయతీల అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాల అభివృద్ధిపై బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయగా హుస్నాబాద్ మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాల సర్పంచులు అధికారులు కార్యదర్శులు హాజరయ్యారు .వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతూ గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో అందరూ భాగస్వాములై అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు.మొత్తానికి గ్రామ అభివృద్ధికి అందరూ సహకరిస్తేనే ముందుకు వెళ్లగలుగుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య,మండల పరిషత్ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## హైవేపై ఉన్న షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

* ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న షాపుల యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వ్యాపారులను ఉద్దేశించి గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థల భద్రతతో పాటు ప్రజల రక్షణ దృష్ట్యా ప్రతి షాపులో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “సీసీ కెమెరాలు నేరాల నివారణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో, దర్యాప్తును వేగవంతం చేయడంలో సీసీ కెమెరాల దృశ్యాలు ఎంతో ఉపయోగపడతాయి. హైవే వెంట ఉన్న ప్రతి వ్యాపార సంస్థ యజమాని బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి” అని తెలిపారు. హైవే ప్రాంతంలో భద్రతను మరింత బలోపేతం చేయడం, దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టడం లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని ఎస్సై వివరించారు. సమావేశానికి హాజరైన షాపు యజమానులు పోలీసుల సూచనలను పాటిస్తూ తమ దుకాణాల్లో త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్‌లో

## జిల్లా స్థాయిలో కొందుర్గ్ మండలం ప్రథమ స్థానం

* తహసీల్దార్ అజం అలీకి ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియలో రంగారెడ్డి జిల్లాలో కొందుర్గ్ మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. మండల పరిధిలో మొత్తం 23,404 మంది ఓటర్లకు గాను 23,350 మంది ఓటర్ల ఎన్యుమరేషన్ వివరాల డిజిటలైజేషన్ పూర్తికాగా, 55 మంది ఓటర్ల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో 99.80 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన బీఎల్ఓలు, జీపీఓలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కొందుర్గ్ మండలం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా మండల తహసీల్దార్ అజం అలీని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లేష్ గౌడ్, అంజిరెడ్డి, బీఆర్ఎస్ రెడ్డి నర్సింలు, సీపీఎం గోపాల్, రాజేందర్ గౌడ్, దుర్గని శ్రీను, జీపీఓలు హరీష్, నరేష్, శ్రీకాంత్, రామస్వామి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసే అత్యంత పవిత్రమైన పర్వదినం

* మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసే అత్యంత పవిత్రమైన పర్వదినమని మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. వేదవ్యాస మహర్షి, గురుపరంపరను స్మరించుకుంటూ ఆమె మాట్లాడుతూ జ్ఞానాన్ని అందించి సమాజ నిర్మాణానికి దోహదపడే గురువుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ గురువులను గౌరవిస్తూ వారు చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.సద్గురు సాయిబాబా బోధించిన ‘శ్రద్ధా - సబూరి’ సూత్రాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకాలని పేర్కొంటూ, ప్రేమ, సేవ, త్యాగం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా ప్రపంచ పులుల దినోత్సవం



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా, ఎస్. రాజశేఖర్, జిల్లా అటవీ అధికారి, నల్గొండ , రేంజ్ పరిధిలోని గొల్లగూడ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ వద్ద పులుల సంరక్షణ వన్యప్రాణుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రజా అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీలో అటవీ శాఖ మినిస్టీరియల్ స్టాప్ , ఎగ్జిక్యూటివ్ స్టాప్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పులుల సంరక్షణ, అటవీ పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, భావితరాల కోసం ప్రకృతి సంపదను కాపాడాల్సిన సామూహిక బాధ్యతపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించబడింది.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు త్రైపాక్షిక ఒప్పందం తప్పనిసరి

: కలెక్టర్



జనగామ, ప్రజాస్ఫూర్తి :జిల్లాలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు, జీతాల చెల్లింపుల్లో పారదర్శకత కోసం త్రైపాక్షిక ఒప్పందాన్ని తప్పనిసరి చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ నెల 25లోగా అన్ని శాఖలు ఏజెన్సీలతో ఒప్పందాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగుల ఖాతాల్లో జీతాలతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లాలో 8 ఏజెన్సీల ద్వారా 577 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నట్లు వెల్లడించారు.

# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పోటీపడే స్థాయికి ఎదగాలి

* మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలో బుధవారం విస్తృతంగా పర్యటించిన మంత్రి ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4 కోట్ల 85 లక్షల వ్యయంతో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, వంట షెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ ఫెన్సింగ్ తదితర మౌళిక వసతుల నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాల్లో జన్మించిన పిల్లలు కూడా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందించాలనే సంకల్పంతో భారీ స్థాయిలో నిధులు కేటాయించామని అన్నారు. ఈ పాఠశాలలో రూ.4.85 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత విద్యార్థినులకు మరింత మెరుగైన వసతి, భద్రత, పరిశుభ్రత, విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి సారించేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్య మాత్రమే జీవితాన్ని మార్చగల శక్తి అని అన్నారు. వ్యక్తిగత ఆసక్తితో పాఠశాలల్లో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయడం అభినందనీయం అని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భారతి నాట్యాలయంలో ఘనంగా గురుపూజోత్సవం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గురుపౌర్ణమి పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత కొత్తగూడెంలోని శ్రీ భారతి నాట్యాలయంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా, శ్రీ భారతి నాట్యాలయం శిక్షకురాలు పర్వీన్ చంద్‌కు మొక్కను అందజేసి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. "మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాట్యాలయ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, కళాభిమానులు పాల్గొని గురువుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. గురుపూజతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువుల ఆశీస్సులతో విద్యార్థులు కళారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చిల్పూర్ మండలం మల్కాపూర్ లో నిర్వహించిన ఆరుతడి,విత్తనాలు, కూరగాయల మేళాలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులు వరి తోపాటు ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆ యిల్ పామ్ సాగు పై దృష్టి సారించాల ని సూచించారు. ఆయిల్ పామ్ సాగు కు ప్రభుత్వం సబ్సిడీలు, సాంకేతిక స హాయం అందిస్తోందని తెలిపారు. ఆరు తడి పంటలతో మంచి ఆదాయం పొం దుతున్న రైతులను సన్మానించి, కూర గాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారు లు, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలోని శ్రీ సాయిబాబా మందిరంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యాపేట నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గురువుల బోధనలు, మార్గదర్శకత్వం వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ వీరన్న నాయక్, స్థానిక కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి, సాయిబాబా ఆలయం సెక్రటరీ మిర్యాల సుధాకర్, ట్రెజరర్ పోతుగంటి మల్లికార్జున్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, షేక్ జహీర్, గుణగంటి హేమ సతీష్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, బెలిదె శ్రీనివాసులు , నాగేల్లి అరుణ్ కుమార్, నరేష్ పిళ్లే, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ హాస్పిటల్ లో మూత్రాశయం లోని రాళ్లు తొలగింపు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని ఆయుష్మాన్ హాస్పిటల్ లో 70 ఏళ్ల సోమనర్సయ్యకు విజయవంతంగా యూరాలజీ శస్త్రచికిత్స నిర్వహించి, మూత్రాశయం నుంచి సుమారు 40 రాళ్లను తొలగించారు. మూత్రం లో రక్త స్రావం సమస్యతో ఆసుపత్రిలో చేరిన ఆయనకు పరీక్షల అనంతరం మూత్రా శయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. డా.మాచర్ల భిక్షపతి ఆధ్వర్యంలో యూరాలజిస్ట్ డా.కిరణ్ సహకారంతో శస్త్రచి కిత్స విజయవంతంగా పూర్తయింది. ప్ర స్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి కోలుకుంటున్నారు. ఆధునిక యూరాలజీ చికిత్సలు, శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆయుష్మా న్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేష్ తెలిపారు.

## విద్యార్థుల చావులకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలి

* మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : నీట్ పేపర్ లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థులను మానసిక వేదనకు గురి చేసి విద్యార్థుల చావులకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలి లేదంటే ప్రధాన నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం సిపిఐ నియోజకవర్గ నాయకులు నాగేల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ లతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును బలి చేసారని నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్రప్రభుత్వాలకే అప్పగించాలనీ అభిప్రాయపడ్డారు. విలేఖరుల సమావేశంలో సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ, సిద్దిపేట జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్, కనుకుట్ల శంకర్, నియోజకవర్గ సిపిఐ నాయకులు బొయిని అశోక్ గూడెం లక్ష్మి, ఉట్కూరి రాములు, బత్తుల బాబు, బాషబొయిన సంతోష్, తెరాల సత్య నారాయణ, జనగాం రాజ్ కుమార్, గాంభీరపు మధు, తొట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మంచి సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

* జేఏసీ చైర్మన్ భానోత్ వీరు నాయక్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్త గూడెం:మంచి సమాజ నిర్మాణంలో గురువులు కీలక పాత్ర పోషిస్తారని బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ భానోత్ వీరు నాయక్, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ లాల్ సింగ్ పేర్కొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తగూడెం మార్కెట్ కమిటీ యార్డ్ ప్రాంగణంలో బంజారా ధర్మ గురువులు, సాధువులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.జేఏసీ జిల్లా చైర్మన్ భానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బంజారా ధర్మ గురువులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. గురువుల ఆశీస్సులు సమాజానికి మార్గదర్శకమని, వారి బోధనలు యువతకు స్ఫూర్తినిస్తాయని వక్తలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ లాల్ సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ నాయక్, భూక్య మోహన్ రాథోడ్, బాలకృష్ణ చౌహాన్, బాబులాల్ నాయక్, బద్రు నాయక్, చందర్ నాయక్, రమేష్ నాయక్, వినోద్ నాయక్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ నాయక్, భానోత్ రమేష్ నాయక్, మోహన్ నాయక్, రాంబాబు, భద్రంజగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు మహారాజ్, జగదాంబ సేన రాష్ట్ర అధ్యక్షులు గణేష్ మహారాజ్, జగదాంబ సేన సాధువుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్ సాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు సాధు, జిల్లా అధ్యక్షులు మాలోత్ రమేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య బాలు సాదు, లచ్చు సాదు, వాంకుడోత్ బాలు సాదు, భానోత్ కిసన్ సాదు, లకావత్ దసరా సాదు, సోమ్లా సాదు, గూగులోత్ లింగ, ఇస్లావత్ కిరు, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఎల్ నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలుచేపట్టడం అత్యంత అవసరమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం గుండాల మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చేపడుతున్న జలసిరి కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత - ప్రతి రైతుకు పంట కుంట - ప్రతి ఊరికి ఊటకుంట" అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మండలంలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి వ్యవసాయ పొలంలో పంట కుంటల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్, గ్రామాల్లో సోక్ పిట్స్ నిర్మాణాన్ని ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు జలసిరి కార్యక్రమంలో చురుకుగా భాగస్వాములు కావాలని, గ్రామాల్లో ప్రజలకు నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. అదనంగా గ్రామాల్లో ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా అధికారులు, సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈసమావేశంలోమండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లాలోని మర్రిపెడ మండలంలో గల కంపాటి రవి బాబు ఆర్ఎంపి ప్రజత క్లినిక్ ను సీజ్ చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి క్లినిక్ వారితో ప్రథమ చికిత్స మాత్రమే చేయవలెనని స్థాయికి మించిన (ఇంజక్షన్లు, సెలైన్లు) వైద్యం చేసినయెడల చట్టరీత్య చర్య తీసుకుంటామని జిల్లాలోని ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపి వైద్యులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య బృందం మనోహర్, కృష్ణ పాల్గొన్నారు

## జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

* సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్.
* ఎంపీడీవో సరోజ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రాయినిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు మ్యాజిక్ డ్రైన్లు బోర్వెల్ రీఛార్జ్ ఫామ్ బాండ్ ఇంటికి ఇంకుడు గుంత పొలాని ఫాంకుంటా ఊరికి ఊరకుంటలను అధికారులు మండల సర్పంచులకు సూచించటం జరిగింది మండల పరిధిలోని ప్రతి గ్రామాలలో చేయించాలని తపనతో మండల అధికారులైనటువంటి ఎంపీడీవో సరోజ ఏపీఓసురేష్ ఎంపీఓ ఇబ్రహీం సిసి సుజాత కార్యదర్శి సునీత ఫీల్డ్ అసిస్టెంట్ సునీత గ్రామ శాఖ వైస్ సర్పంచి నాగరాజ్ నెంబర్ శ్రీకాంత్ అధ్యక్షుడు గుండు సాంబయ్య గోవిందు గామా పంచాయతీ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కలెక్టర్ హరిత ప్రత్యేక చర్యలు

* 26 మంది గిరిజన లబ్ధిదారుల ఎంపికకు లాటరీ నిర్వహణ




కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి:జిల్లాలో గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం కింద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం జిల్లా కలెక్టరేట్ లో లాటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను గిరిజన మత్స్యకారుల కోసం 21 ద్విచక్ర వాహనాలు, 5 త్రిచక్ర వాహనాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 491 మంది గిరిజన మత్స్యకారులు దరఖాస్తు చేసుకోగా, పారదర్శకంగా లాటరీ పద్ధతిలో 26 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధిని విస్తరించుకోవడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని గిరిజన మత్స్యకారులకు కలెక్టర్ సూచించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రభాకర్, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ అధ్యాపకులకు బీజేపీ ఘన సన్మానం



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సం దర్భంగా రిటైర్డ్ అధ్యాపకులను ఘనం గా సన్మానించారు. "గురు బ్రహ్మ గురు విష్ణు..." శ్లోకాన్ని స్మరిస్తూ గురువుల సేవ, గౌరవం అత్యున్నతమైనవని, గురు వు లేనిదే విద్యార్థి పురోగతి సాధ్యం కా దని నాయకులు పేర్కొన్నారు.ఈ సంద ర్భంగా పి.హరిబాబు, కాసం విజయ్ కుమార్, మిరియాల రమేష్, పాషికంటి యాదగిరి, కొక్కొండ జగదీశ్వరాచారి, కర్రే కృష్ణ, విద్యాసాగర్, హేమలత,విమలాదేవి, జి. ఉమారాణి తదితర రిటైర్డ్ అధ్యాపకులను శాలువాలు కప్పి,పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఉడుగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్ల య్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో జిల్లా ఆస్పత్రి.. అవస్థల్లో ప్రజలు!

* వర్షం వస్తే చాలు.. జలమయంగా మారుతున్న ఆస్పత్రి ప్రాంగణం
* రోగులు, సహాయకులు, సిబ్బందికి తప్పని తిప్పలు.. నీటిలోనే రాకపోకలు
* డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు.. శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు







జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అంటేనే ప్రజలకు భరోసా కలిగించే వైద్యాలయం. అయితే వర్షం పడిందంటే చాలు.. అదే ఆస్పత్రి ప్రాంగణం రోగులకు నరకప్రాయంగా మారుతోంది. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణ జలమయమైంది. ఆస్పత్రి ప్రాంగణంలో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలిచిపోవడంతో రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**నీటిలోనే రాకపోకలు..**

ఆస్పత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ఇతర వైద్య విభాగాలకు వెళ్లేందుకు రోగులు, వారి సహాయకులు నిలిచిన వర్షపు నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం ఈ నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఆస్పత్రి ప్రాంగణంలో నడవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

**వర్షం పడిన ప్రతిసారీ ఇదే తంతు..**

ఆస్పత్రి ప్రాంగణంలో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతమవుతోందని రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోవడం.. వర్షం తగ్గిన తర్వాత కూడా నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు.

**దోమల బెడదతో మరో ముప్పు..**

ఆస్పత్రి ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు రోజుల తరబడి అలాగే ఉంటే దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనారోగ్యంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే ప్రజలకు అపరిశుభ్ర వాతావరణం మరిన్ని సమస్యలకు కారణమయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన జిల్లా ప్రధాన ఆస్పత్రిలోనే పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**శాశ్వత పరిష్కారం చూపాలి..**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రి ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగించాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచిపోకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ప్రజలకు అత్యంత కీలకమైన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

## వేములకొండ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వేములకొండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఎస్డిఎఫ్ నిధుల నుండి రూ.13.50 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటూ, విద్యార్థుల భవిష్యత్తుకు మరింత బలమైన పునాది వేస్తామని తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ యేర్పుల వెంకటేశం , మాజీ సర్పంచ్ గడ్డం బిక్షపతివలిగొండ మండల ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు, అధికారులు, పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్వోసి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కుంభం

* పేద ప్రజల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఎమ్మెల్యే



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: భువనగిరి నియోజకవర్గానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు వైద్య చికిత్సల నిమిత్తం మొత్తం రూ.10,25,000 వేల విలువ గల నాలుగు లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు పత్రాలను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద కుటుంబాలు వైద్య చికిత్సలకు దూరం కాకుండా అర్హులైన వారికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.పేద ప్రజల ఆరోగ్య సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతిలో.. గురువు స్థానం అత్యున్నతం

- గ్రీన్ గ్రోవ్ ఇన్స్టిట్యూషన్స్ లోఘనంగా గురు పూజోత్సవం
- చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతీయ సంస్కృతిలో అత్యున్నత స్థానం గురువు స్థానమని గ్రీన్ గ్రోవ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ ఇన్స్టిట్యూషన్స్‌లో బుధవారం గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులకు పాదాభివందనం చేశారు. గురువుల ఆశీస్సులు పొందారు. అనంతరం చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా గురు పూజోత్సవం నిలుస్తుందన్నారు. గురువుల గొప్పతనం, గురుశిష్య సంబంధం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గురించి విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రుల తరువాత జీవితానికి సరైన దిశను నిర్దేశించే వ్యక్తి గురువు అన్నారు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అన్నారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య నేర్పించే గురువుల సేవలు అమూల్యమైనవన్నారు. విద్యార్థులు నిర్వహించిన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాదుపల్లి లక్ష్మి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు గ్రామ పాలనకు కేంద్ర బిందువులుగా పనిచేస్తాయన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించడంలో నూతన కార్యాలయ భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నెకంటి కమలమ్మ-యాదయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి నాయకులు సామ రామ్ రెడ్డి ఇంకామండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు,వార్డు సభ్యులు,అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## పోలింగ్ బూత్ ల సంఖ్యను పెంచండి

* హుస్నాబాద్‌లో బీజేపీ సర్ ప్రవాస్ అభియాన్
* పోలింగ్ బూత్‌ల పెంపునకు ఆర్డీఓ రామ్మూర్తి కి వినతి

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ ప్రవాస్ అభియాన్ సంయోజక్ ఖమ్మం వెంకటేశం 24 గంటలపాటు పర్యటించి పార్టీ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తిని కలిసి, పట్టణంలో ఓటర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి, బూత్‌ల సంఖ్యను పెంచాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగాబిజెపి జిల్లా కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ బూత్ కమిటీలే భారతీయ జనతా పార్టీకి వెన్నెముక అని అన్నారు. ప్రతి కార్యకర్త తన పరిధిలోని ప్రతి కుటుంబాన్ని కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని, యువత, మహిళలు, రైతులు, మేధావులు సహా అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, నాయకులు తగరం లక్ష్మణ్ రాయికంటి చందు, తోట సమ్మయ్య, ఎర్రవెల్లి ప్రశాంత్ పెందోట భూశంకరాచారి, ఇల్లందుల తిరుపతి, బొడిగె వెంకటేష్, ఎర్రోజు సాయికృష్ణ,నందకుమార్,వరియోగుల మురళీధరస్వామి, విలసాగరం మురళీమోహన్, బూత్ అధ్యక్షులు బిఎల్ఏ2లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టర్లు కరపత్రాలు ఆవిష్కరించిన అదనపు కలెక్టర్




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పిల్లల కళ్లలో ఆనందం,కుటుంబ భవిష్యత్తు,రాష్ట్ర ప్రగతి అన్నీ విద్యతోనే సాధ్యమవుతాయని ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్య కోసం ఖర్చు చేస్తున్నాయని, ప్రతి పేద పిల్లవాడు చదువుకోవాలి. ఆశలు పెంచుకోవాలి. పాఠశాలలో కూర్చుని నేర్చుకున్న ప్రతి అక్షరం జీవితాన్ని వెలిగించే దీపమని జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె .అనిల్ కుమార్ అన్నారు.బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, విద్యాశాఖ సహకారంతో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు,కరపత్రాలను ఆవిష్కరించి జిల్లా వ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాభ్యాసం కోసం పెట్టే ఒక్కో రూపాయి, రాబోయే తరాల కన్నీళ్లు తుడిచే అమూల్యమైన పెట్టుబడిగా మలుస్తుందని స్పష్టం చేశారు. విద్య అనేది పేదవాడి ఆయుధం, అక్షరాస్యతే సమాజానికి అజ్ఞానం నుంచి విముక్తి అని తెలిపారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రముఖ సైకాలజిస్ట్ డా" పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల పరీక్షల ఫలితాల ఉన్నతికై ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నామని,గత పది సంవత్సరాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యాసంస్థలు వినియోగించుకోవాలని, విద్యాశాఖ సహకరించాలి.ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సహజ పాల్గొన్నారు.

## అందని ద్రాక్షగా మారిన విద్యార్థుల స్కాలర్షిప్

**: తీగుళ్ళ శ్రీనివాస్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ బకాయిలు.. విద్యాసంస్థలకు అందని ద్రాక్షగా మారాయని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ ఆరోపించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ కళాశాల స్వాగత సభలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందక, వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రామీణ విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరార. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యార్థుల కళాశాల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యా హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పోలేపల్లి మల్లేష్, సురివి అరవింద్, రేణుక, నికిత, మహాలక్ష్మి, అక్షయ శ్రీజ, లావణ్య, శివాని, మణికంఠ, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలి




గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామం లో వార్డు మెంబర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కామ్పాటి రాజు ఆధ్వర్యంలో బిజెపి పార్టీ ఆఫీసు మరియు బిజెపి జెండా దిమ్మె బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బిజెపి జెండా ఆవిష్కరించినారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గరిడేపల్లి మండలంలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరడం జరిగినది ఈ కార్యక్రమం కు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొబ్బ భాగ్య రెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో బిజెపి జెండా దిమ్మెలు నిర్మించి జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల భిక్షమయ్యగౌడ్ రామినేని కృష్ణయ్య జిల్లా కోశాధికారి తాళ్ల నరేందర్ రెడ్డి జెనిగల శ్రీనివాస్ నర్సింగ్ అంజయ్య చిత్తలూరు సోమయ్య మేకపోతుల వీరప్రసాద్ నర్సింగ్ నాగ సైదులు రావుల ఆంజనేయులు కోలా గోపి బంటు అంజయ్య బానోతు ప్రసాదు తదితరులు పార్టీ నాయకులు సానుభూతిపరులు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటర్ల వివరాల డిజిటలై జేషన్‌ను వేగవంతం చేసి, బీఎల్ఓలు నమోదు చేసిన వివరాలను ఈఆర్ఓ లు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మరో రెండు రోజుల్లో డేటా లోపాలను సరిదిద్దాలని,లేకుంటే బాధ్యుల పై చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. ఓ టరు జాబితాకు ప్రభుత్వ సంక్షేమ పథ కాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజ లకు స్పష్టంగా తెలియజేయాలని సూ చించారు. జిల్లాలో ఇప్పటివరకు 99. 19 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని, రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తా మని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.

## ఉచిత పోలీస్ కానిస్టేబుల్,ఎస్సై కోచింగ్ ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోండి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, సబ్ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉద్యోగాలకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహిస్తున్న ప్రవేశ (స్క్రీనింగ్) పరీక్ష ఆగస్టు 2, 2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుంది.ఈ ప్రవేశ పరీక్షను మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్, మహర్షి స్కూల్, కేసముద్రం రోడ్ పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు.ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకొని పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు.రవాణా సౌకర్యం అవసరమైన అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చు. అవసరాన్ని బట్టి సంబంధిత పోలీస్ స్టేషన్ల నుండి పరీక్షా కేంద్రాలకు వాహనాల ఏర్పాటు చేయబడుతుంది.

# ఊపిరితిత్తుల వ్యాధులకు శస్త్రచికిత్స అవసరం లేదు

* అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీతో కోత లేకుండానే చికిత్స
* యశోదా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా: ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసనాళాల అవరోధం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, దీర్ఘకాలిక దగ్గు, రక్తంతో దగ్గు, తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు వంటి సమస్యల నిర్ధారణ, చికిత్స కోసం గతంలో చాలాసార్లు పెద్ద శస్త్రచికిత్సలు అవసరమయ్యేవని, ఇప్పుడు ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధితో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా శరీరాన్ని పెద్దగా కోయకుండా, అత్యల్ప గాట్లతోనే అనేక క్లిష్టమైన ఊపిరితిత్తుల వ్యాధులను గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయడం సాధ్యమవుతోందని హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యులు, ఎం.డి (రెస్పిరేటరీ మెడిసిన్), డి.ఎం (పల్మనరీ, క్రిటికల్ కేర్ స్లీప్ మెడిసిన్) డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసనాళాల ఇరుకుదనం, పునరావృతమయ్యే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ప్లూరల్ ఎఫ్యూషన్, ఎంఫిసీమా వంటి క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులకు అత్యల్ప జోక్యంతో, తక్కువ నొప్పితో, వేగవంతమైన కోలుకునే విధంగా ఆధునిక చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.

**ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అంటే...**

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అనేది శ్వాసకోశ వైద్యశాస్త్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ. ఇందులో ప్రత్యేక బ్రాంకోస్కోపీలు, అల్ట్రాసౌండ్ ఆధారిత సాంకేతికతలు, చిన్న రంధ్రాల ద్వారా చేసే చికిత్సా విధానాలను ఉపయోగించి ఊపిరితిత్తులు, శ్వాసనాళాలు, ఛాతీ లోపలి భాగంలోని అనేక క్లిష్టమైన వ్యాధులను నిర్ధారించి చికిత్స అందిస్తారు. సాంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఇవి అత్యల్ప జోక్యంతో పూర్తవుతాయి. ఫలితంగా రోగికి నొప్పి తక్కువగా ఉండటంతోపాటు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ ప్రణయ్ సాయి తెలిపారు.

* **అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలు**

యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఉఆఖఖి) ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ, స్టేజింగ్, అడ్వాన్స్డ్ ఫ్లెక్సిబుల్, రిజిడ్ బ్రాంకోస్కోపీ, శ్వాసనాళాల్లో ఏర్పడిన కణితులు, అవరోధాల తొలగింపు, ఎయిర్వే స్టెంటింగ్, క్రయోథెరపీ, ఎలక్ట్రోకాటరీ ద్వారా శ్వాసనాళాల చికిత్స, ఊపిరితిత్తుల చుట్టూ పేరుకునే ద్రవం తొలగింపు (ప్లూరల్ ఇంటర్వెన్షన్స్), మెడికల్ థొరాకోస్కోపీ, ఎంఫిసీమా రోగులకు బ్రాంకోస్కోపిక్ లంగ్ వాల్యూమ్ రిడక్షన్, ఇమేజ్ గైడెడ్ బయాప్సీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

* **రోగులకు కలిగే ప్రయోజనాలు**

ఈ ఆధునిక చికిత్సా విధానాల ద్వారా రోగులకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. పెద్ద శస్త్రచికిత్స అవసరం తగ్గుతుంది, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం, నొప్పి తక్కువ, సంక్లిష్టతలు తగ్గుతాయి, ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గుతాయి, శ్వాసనాళాల అవరోధం, ఊపిరితిత్తుల్లో నీరు వంటి సమస్యలకు తక్షణ ఉపశమనం కలుగుతుంది. పెద్ద శస్త్రచికిత్స చేయించుకోలేని వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలున్న రోగులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని తెలిపారు.

* **విప్లవాత్మక మార్పులకు నాంది...**




'ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ శ్వాసకోశ వైద్యంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. గతంలో పెద్ద శస్త్రచికిత్స అవసరమైన అనేక ఊపిరితిత్తుల వ్యాధులను ఇప్పుడు అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సురక్షితంగా నిర్ధారించి చికిత్స చేయగలుగుతున్నామన్నారు. ముఖ్యంగా ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్, అడ్వాన్స్డ్ బ్రాంకోస్కోపీ, మెడికల్ థొరాకోస్కోపీ, ఎయిర్వే ఇంటర్వెన్షన్స్, ఇమేజ్ గైడెడ్ విధానాల ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, రోగికి తక్కువ నొప్పితో, తక్కువ రోజుల్లో కోలుకునేలా సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యమవుతోందన్నారు. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంతో దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాంతక వ్యాధులను కూడా సకాలంలో గుర్తించి విజయవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు.

* **ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా చికిత్స**

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా క్రింది సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్, దీర్ఘకాలిక దగ్గు, శ్వాసనాళాల అవరోధం, పదేపదే వచ్చే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరడం, ఛాతీలో లింఫ్ గ్రంథుల వాపు, తీవ్రమైన ఎంఫిసీమా, ఇతర క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులకు చికిత్స అందుతుందన్నారు. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంతో దగ్గు, పదేపదే ఛాతీ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల్లో అనుమానాస్పద మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదిస్తే అనేక ప్రాణాంతక వ్యాధులను సకాలంలో గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని మలక్పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, అత్యాధునిక బ్రాంకోస్కోపీ సూట్లు, ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్, మెడికల్ థొరాకోస్కోపీ, ఆధునిక ఇమేజింగ్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ నిపుణులతో క్లిష్టమైన ఊపిరితిత్తుల వ్యాధులకు కూడా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, శాస్త్రీయ చికిత్సా విధానాలు, బహుళ విభాగాల నిపుణుల సమన్వయంతో రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం యశోదా ఆసుపత్రుల లక్ష్యమని వారు పేర్కొన్నారు.

## మత్స్యాద్రి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో కొలువైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తుమ్మల శ్రీనివాస్ కి ఎమ్మెల్యే కుంభం శుభాకాంక్షలు తెలిపారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు దేవస్థాన ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు నూతన ఆలయ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తానని తెలిపారు అనంతరం ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్ పోలపాక జానకి రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ మాజీ జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజ్ చిట్టెడి జనార్దన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు,,ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

* **రానున్న 36 గంటలు కీలకం – ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రానున్న 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అధికారులు తప్పనిసరిగా తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, ప్రవహిస్తున్న నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు. రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహించే ప్రాంతాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా సురక్షిత నీటి సరఫరా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో అవసరమైన సూచనలు అందించాలని, గ్రామీణ నీటి సరఫరా విభాగం తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని, ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

## స్వయంభు రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వరుణ యాగం



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయ ఈవో పి . కిషన్ రావు ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశానుసారం మన ప్రాంతం రాష్ట్రం పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని పంటలు బాగా పండి అన్నదాతలు బాగుండాలని కోరుతూ అన్ని దేవాలయాల్లో ఘటాభిషేకములు, వరుణ యాగాలు నిర్వహించాలని సూచించడం జరిగిందని ఆలయ ఈవో తెలిపారు. అందులో భాగంగానే పొట్లపల్లి గ్రామంలో ఉన్నటువంటి శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ వరుణ్యాగాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ చెప్యాల శ్రీధర్ గ్రామపంచాయతీ సిబ్బంది ఆలయ సిబ్బంది గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎం ఎల్ సి పట్నం మహేందర్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన జ్యోతి భీమ్ భరత్

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇటీవల తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఎం ఎల్ సి పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ మృతి చెందడంతో బుధవారం రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ షాబాద్‌లోని వారి ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఎం ఎల్ సి పట్నం మహేందర్ రెడ్డి , వారి సతీమణి ఉమ్మడి రంగా రెడ్డి మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి లను పరామర్శించారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్స్పైరింగ్ సీజన్ ఫర్ స్టూడెంట్స్ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మహబూబాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా" పి. శభరీష్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యుక్తవయస్సులో మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి, విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలను జీవితంలో ఆచరించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలిచి మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ డైరెక్టర్ డా. జె. ప్రమోద్ రెడ్డి, మహేంద్ర రెడ్డి విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా ఎస్పీ డా. పి. శభరీష్ ని శాలువాతో సత్కరించి, యువతలో చైతన్యం కల్పించేందుకు ఆయన చేస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించడంలో ఎల్లప్పుడూ ముందుండే ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

## ఎస్.జేస్కోర్ లో ఐదు స్థాయిల తనిఖీ వ్యవస్థ

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో పరి శుభ్రత, పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూపొందించిన ఎస్.జే స్కోర్ కార్యక్రమం సమర్థవంతంగా అమలవు తోంది. గ్రామాల పరిశుభ్రతను 100 మార్కుల ఆధారంగా అంచనా వేసే ఈ విధానం లో ఐదు స్థాయిల తనిఖీ వ్యవస్థ, ఎస్. జే స్కోర్ యాప్ ద్వారా పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు, నెలవారీ సమీక్షలు నిర్వహించనున్నారు. 85 కి పైగా మార్కులు సాధించిన గ్రామాలకు 'ఎ' గ్రేడ్, 55 కంటే తక్కువ మార్కులు వచ్చిన గ్రామాలకు 'డి' గ్రేడ్ ఇస్తారు. బహిరంగ మలవిసర్జన, మురుగు నిల్వ, తాగు నీటి లీకేజీలు వంటి రెడ్ ఫ్లాగ్ అంశాలు గుర్తిస్తే నేరుగా 'డి ' గ్రేడ్ కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

## గురు రవిదాస్ సేవలు చిరస్మరణీయం

* **బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గురు రవిదాస్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు. బుధవారం ముస్తాబాద్ మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సౌల్లా క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రవిదాస్ క్రీస్తు శకం 15 నుంచి 16వ శతాబ్దంలో భక్తి ఉద్యమానికి చెందిన భారతీయ ఆధ్యాత్మిక కవి, సాధువు అని కొనియాడారు. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలో గురువుగా గౌరవించబడ్డారని గుర్తుచేశారు. ఆయన గొప్ప కవి, సామాజిక సంస్కర్త, పురాతన ఆధ్యాత్మిక మూర్తి అని పేర్కొన్నారు. సమాజంలో సమతా భావాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేష్, ప్రధాన కార్యదర్శులు ఎదునూరి గోపి, బుచ్చెల్లి మహేశ్వరి, కోశాధికారి జిల్లెళ్ళ మల్లేష్, గూడెం ఉపసర్పంచ్ దగ్గు నవీన్, తోట్ల మల్లేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, ఆర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కస్తూరి గాల్ రెడ్డి, కరెడ్ల రమేష్, కస్తూరి కార్తీక్ రెడ్డి, బూత్ అధ్యక్షులు దీటి సత్యం, నిరటి సాయికుమార్, రాగుల వంశీ, వినయ్ చల్ల శివకృష్ణ, ఆకాష్, వెంకటేష్, పున్నం అనిల్, శ్యామ్ పాల్గొన్నారు.

## ఫాసిస్టు విష సంస్కృతిని ఐక్యంగా తిప్పికొడుదాం

* **అజ్మీర బిచ్చ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు.**




మహబూబాబబాద్, ప్రజాస్ఫూర్తి : భారతదేశ వ్యాప్తంగా పీడిత ప్రజలను వారి సంస్కృతిని ధ్వంసం చేస్తున్న పాసిస్ట్ విష సంస్కృతిని ఐక్యంగా తిప్పికొడదామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర బిచ్చ అన్నారు. మహబూబాబాద్ లోని సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రముఖ ప్రజా కళాకారులు లకావత్ తారాచంద్, మెంతెన కొండల్ రావు లు అరుణోదయ సంస్థలో బుధవారం చేరిన సందర్భంగా వారికి కండువా కప్పి బిచ్చ సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ కళ కోసం కాకుండా పీడిత ప్రజల కష్టాన్ని ఆట పాట మాట రూపంలో సమాజానికి అర్థం చేయించే బాధ్యత ప్రతి ఒక్క కళాకారుడిపై ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పాటలు, నాటికలు బుర్ర కథలు వీధి భాగోతాలు డప్పు డాన్స్ యక్షగానాలు తదితర రూపాలలో ప్రజలకు వివరించడంలో అరుణోదయ సంస్థ ముందుంటుందని అన్నారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ సామ్రాజ్యవాదులు భూస్వామ్య సంస్కృతితో కుమ్మక్కైన గుత్త పెట్టుబడిదారులు చేస్తున్న దేశ వనరుల దోపిడీపై ప్రజలకు అర్థం చేయించే బాధ్యత కళాకారులదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి ఈర్ల వెంకన్న అధ్యక్షతన జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బుర్ర రాఘవులు, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షులు బి నరసింహారావు తదితరులు ప్రసంగించారు.

## గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమస్యల పట్ల పోరాటం చేస్తాము

* **టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా ఇంచార్జి గుండా ఉపేందర్ రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి: తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమస్యల మీద తెలంగాణ వార్డు మెంబెర్స్ ఫోరం పార్టీలకు అతీతంగా పని చేస్తూ సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తుంది. గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులలో వార్డు సభ్యులను భాగస్వామ్యం చేయాలని కోరుతున్నాము. అభివృద్ధి శిలాఫలకం పైన గ్రామ వార్డు సభ్యులు పేర్లు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము. ప్రభుత్వం హామీ మేరకు వార్డు సభ్యులకు గౌరవ వేతనం మూడువేల రూపాయలు అందించాలని గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. అదేవిధంగా నా మీద నమ్మకం ఉంచి, టీ డబ్ల్యు యం ఎఫ్ ఖమ్మం జిల్లా బాధ్యతలు అప్పగించిన ఫోరం వ్యవస్థాపకులు నాగబెల్లి జ్యోతి కి ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు కృతజ్ఞతలు తెలియచేస్తునాను. జిల్లాలో ప్రతి మండలం లో కమిటీలు పూర్తి చేసి, గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పాలుపంచుకొని, ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగాలన్నారు.



## ఇంట్లోనే మేకప్ వేసుకోండి.. బ్యూటీ పార్లర్ బిల్లు తగ్గించుకోండి..

అందంగా కనిపించాలంటే అలంకరణ ఎంతో అవసరం. ప్రస్తుత రోజుల్లో ప్రతి చిన్న ఫంక్షన్ కు కూడా బ్యూటీ పార్లర్ కు వెళ్లడం కామన్ అయిపోయింది. ఇక వాళ్లు కూడా గట్టిగానే ఫీజులు గుంజుతున్నారు. అయితే బ్యూటీ పార్లర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొన్ని సింపుల్ టిప్స్ తో ఇంట్లోనే అందంగా మేకప్ చేసుకోవచ్చు. ఆ టిప్స్ ఏంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

**ఫేస్ క్లీనింగ్**

మేకప్ చేసుకోవడానికి ముందుగా ఫేస్ క్లీనింగ్ అనేది చాలా ముఖ్యం. ముఖంలో మెరుపు రావాలంటే మేకప్ వేసుకోవడానికి రెండు గంటల ముందు అలోవెరా జెల్ రాసుకోవాలి. ఆ తర్వాత మీరు మేకప్ వేసుకుంటే, మీ మేకప్ చాలా గ్లోగా కనిపిస్తుంది. అలోవెరా జెల్ అప్లై చేసుకున్న 10 నిమిషాల తర్వాత మీ ముఖాన్ని ఫేస్ వాష్‌తో కడుక్కోండి. ఆపై ముఖానికి మంచి మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఇది ముఖ చర్మానికి తేమను అందిస్తుంది. ఈ విధంగా మీ ముఖం మేకప్ కోసం సిద్ధంగా ఉండండి.

**ప్రైమర్ :**

ఏ రకమైన మేకప్ అయినా వేసుకునే ముందు, మాయిశ్చరైజేషన్,ఆ తర్వాత ప్రైమర్ అప్లై చేయడం చాలా ముఖ్యం. ఈ రెండు అప్లై చేయడం వల్ల ముఖంపై బేస్ సిద్ధంగా ఉంటుంది. ఇవి అప్లై చేయడం వల్ల వల్ల మీ మేకప్ ఎక్కువసేపు ఉంటుంది. ప్రైమర్‌ను అప్లై చేయడం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏటంటే, ముఖంపై ఉన్న మొటిమలు , మచ్చలు చాలా వరకు కనిపించకుండా ఉంటాయి.

**ఫౌండేషన్ :**

ప్రైమర్‌ను అప్లై చేసిన తర్వాత, ఫౌండేషన్‌ను అప్లై చేయండి. దీని కోసం, ఫౌండేషన్‌లో కొంత ఫేస్ క్రీమ్ మిక్స్ చేయండి. తద్వారా ఫౌండేషన్ బాగా మిక్స్ అవుతుంది. అప్పుడు మొత్తం ముఖంపై దీనిని అప్లై చేయండి. ఫౌండేషన్ ఎల్లప్పుడూ మీ చర్మం కంటే తేలికగా ఉండాలి. మీ ముఖంపై ఎక్కువ ఫౌండేషన్ రాసుకోకూడదని గుర్తుంచుకోండి.

**బ్లషర్, హైలైటర్ :**

ఫౌండేషన్ అప్లై చేసిన తర్వాత, బ్లషర్ ఉపయోగించండి. దీన్ని ఉపయోగించేటప్పుడు ఇందులో చాలా లేత రంగులు ఉపయోగించాలని గుర్తుంచుకోండి. లైట్ మేకప్ కోసం పీచ్ , పింక్ కలర్ బ్లషర్స్ వంటివి వాడితే చాలా బాగుంటుంది. మీరు ఏ రంగును ఎంచుకున్నా సరే అది మీ బుగ్గలపై ఎక్కువగా అప్లై చేయకూడదని గుర్తుంచుకోండి. ఒక వేళ మీరు హైలైటర్‌ను ఉపయోగించాలని అనుకుంటే మంచి కలర్ అప్లై చేయండి. ఇది మీ లుక్ సహజంగా కనిపించేలా చేస్తుంది.

**కనుబొమ్మలు అందంగా అలంకరించుకోండి..**

ఫేస్ మేకప్ తర్వాత, మీరు ఐ మేకప్ చేసినప్పుడు, అత్యంత ముఖ్యమైంది కాజల్.. ఎందుకంటే అది లేకుండా కళ్ళు నిస్తేజంగా కనిపిస్తాయి. ఇందుకోసం మీరు బ్రాండెడ్ కంపెనీ కాజల్‌ని మాత్రమే ఉపయోగించండి. ఆ తర్వాత ఐలైనర్ ను కూడా అప్లై చేయండి. దీంతో మీ మేకప్ పూర్తవుతుంది.

**అందమైన పెదాల కోసం..**

మేకప్‌లో లిప్‌స్టిక్‌కు అత్యంత ఆకర్షణ ఉంటుంది. మీరు మీ ఎంపిక ప్రకారం లిప్‌స్టిక్‌ను ఎంచుకోండి. ఎందుకంటే మీ స్కిన్ టోన్ ప్రకారం మీకు ఏ రంగు లిప్‌స్టిక్ సరిపోతుందో మీకు తెలుస్తుంది. నేచురల్ లుక్ కావాలంటే మరీ బ్రైట్ షేడ్ కాకుండా లైట్ కలర్ లిప్ స్టిక్ మాత్రమే ఉపయోగించండి.





## బ్రౌన్ రైస్ మంచిదేనా? నిజంగానే ఇన్ని లాభాలు ఉన్నాయా?

ఇటీవల స్థూలకాయం పెద్ద సమస్య. వీటితో పాటు బీపీ, షుగర్లు కామన్ అయిపోయాయి. శారీరక శ్రమ లేకపోవడం.. ఆఫీసులో, ఇంట్లో కుర్చీలకు అతుక్కుపోవడంతో అనేక రకాల ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. అందుకే చాలా మంది ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటున్నారు. వైట్ రైస్ ఎక్కువగా తీసుకోవడం వల్ల సమస్యలు వస్తున్నాయని.. చాలా మంది బ్రౌన్ రైస్ తింటున్నారు. బ్రౌన్ రైస్ నిజంగానే మంచిదేనా? అసలు ఈ బ్రౌన్ రైస్ తీసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం..

**ఎందుకు బ్రౌన్ రైస్ బెటర్?**

బ్రౌన్ రైస్ బయట ఉండే రక్షిత షెల్ వల్ల ఆరోగ్యకరమైన బియ్యంగా పరిగణిస్తారు. దీనిని పొట్టు అని పిలుస్తారు. తెల్ల బియ్యం వలె కాకుండా.. బ్రౌన్ రైస్ ఊక పొరను కలిగి ఉంటుంది. ఇది గణనీయమైన పోషకాలను కలిగి ఉంటుందని ఆహార నిపుణులు చెబుతన్నారు. బ్రౌన్ రైస్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక క్రమపద్ధతిలో ఉంచేందుకు తోడ్పడుతుంది. మధుమేహంతో బాధపడే వారికి ఇది అద్భుతమైన ఆహార ఎంపిక. రోజూ అరకప్పు అన్నం తినే వారికి మధుమేహం వచ్చే ప్రమాదం 60% తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు పాలిష్ చేసిన బియ్యాన్ని క్రమం తప్పకుండా తీసుకునే వారికి మధుమేహం వచ్చే అవకాశాలు వంద రెట్లు పెరుగుతున్నట్లు గుర్తించారు.

**ఫైబర్ అధికంగా ఉంటుంది**

బ్రౌన్ రైస్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కార్సినోమాను నివారించడంలో సహాయపడే ఆహారాల జాబితాలో ఇది అగ్రస్థానంలో ఉంది. సహజంగా బియ్యంలో ఉండే అధిక స్థాయి ఫైబర్ దీనికి కారణమని చెప్పవచ్చు. ఈ ఫైబర్స్ శరీరంలోని టాక్సిన్స్‌పై ఇంకా క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థాలతో పోటీపడతాయి. తద్వారా వాటిని తొలగించి.. పెద్దపేగు గోడకు అటాచ్ చేయకుండా ఉంచుతుంది.

**యాంటీఆక్సిడెంట్లు**

బ్రౌన్ రైస్‌లో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆక్సిజన్ ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టానికి వ్యతిరేకంగా తమ రక్షణను విస్తరింపజేస్తాయి. ఇందులో సూపర్ ఆక్సైడ్ డిస్ముటేస్ అనే ముఖ్యమైన యాంటీ ఆక్సిడెంట్ ఎంజైమ్ ఉంటుంది. ఇది శక్తి ఉత్పత్తి సమయంలో ఆక్సీకరణ నష్టం నుంచి కణాలను రక్షిస్తుంది.

**బరువు తగ్గడానికి**

అన్నంలోని ఫైబర్ కంటెంట్ పేగు పనితీరును గరిష్ట స్థాయిలో ఉంచుతుంది. ఎందుకంటే ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. డైట్‌లో క్రమబద్ధతను కోరుకునే వారికి.. రోజువారీ ఆహారంలో బ్రౌన్ రైస్ తీసుకుంటే మంచిది. అదనంగా తక్కువగా తీసుకున్నా.. కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కార్డియోపతి, అధిక కొలెస్ట్రాల్ సంభావ్యతను తగ్గిస్తాయని పలు అధ్యయనాలు నిరూపించాయి.





## పరగడపున గ్లాస్ వేడినీళ్లు తాగేయండి.. అద్భుతాలు జరుగుతాయి

ప్రస్తుతం ఆరోగ్యం ఎంతో ప్రాధాన్యఅంశంగా మారిపోయింది. జీవనశైలి, ఆహారపు అలవాట్లతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అందుకే మనం ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని టిప్స్ కచ్చితంగా ఫాలో కావాలి. శారీరక శ్రమ చేయాలి.. కేలరీస్ కరిగించుకోవాలి. పొద్దున్నే పరగడుపున ఓ గ్లాస్ వేడినీళ్లు తాగితే అనేక ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. వేడి నీరు తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుంది.

**గ్యాస్ట్రిక్ సమస్యలు దూరం**

గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి వేడి నీరు బాగా సాయపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కావడానికి వేడి నీరు ఉపయోగపడుతుంది.

**మలబద్ధకం దూరం**

మలబద్దకం సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు పరిగడుపున వేడి నీరు తాగడం వల్ల నొప్పి లేకుండా సులభంగా విసర్జన అవుతుంది. దీర్ఘకాలికంగా మలబద్దకం సమస్యలను తగ్గిస్తుంది.

**వెయిట్ లాస్..**

ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల తొందరగా బరువు తగ్గించడంలో సాయపడటంతో పాటు ఆకలిని నియంత్రిస్తుంది. బాడీలో ఉన్న వ్యర్థ పదార్థాలను పంపించడంలో వేడి నీరు ఉపయోగపడుతుంది. అలాగే రక్త ప్రసరణను పెంచుతుంది.



### మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి..

# కంగనా వ్యాఖ్యలపై సోనూ సూద్



జెన్‌జీ పై భాజపా ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు సోనూసూద్ స్పందించారు. నటులను స్టార్లను చేసేది యువతేనని, వారిని గౌరవించాలని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కంగనా వ్యాఖ్యల వివాదంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తొలుత ఆమె చేసిన వ్యాఖ్యలను తాను వినలేదని చెప్పారు. యువతను ఉద్దేశించి కంగనా గట్టర్ జనరేషన్ అనే పదాన్ని వాడినట్లు విలేకరులు చెప్పగా ఆయన తీవ్రంగా స్పందించారు. ''ఆమె నిజంగా ఆ మాట అని ఉంటే అది చాలా సిగ్గుచేటు. అలా మాట్లాడాల్సింది కాదు. నోరు జారే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. నటులకు గుర్తింపు తెచ్చేది యువతీ యువకులే. వారు మీ వెన్నంటి ఉన్నంత కాలమే మీరు ఎదుగుతారు. వారి మద్దతు లేకపోతే కష్టమవుతుంది. కాబట్టి అందరినీ కలుపుకొని పోవాలి. వృత్తి ఏదైనా సరే.. ప్రజలతో మమేకమైనప్పుడే దానికి ఓ అర్థం ఉంటుంది. ప్రజలే దేవుళ్లు. మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి'' అని హితవు పలికారు. ఇటీవల జంతర్‌మంతర్ తదితర ప్రాంతాల్లో నిరసనలు చేస్తున్న యువతను ఉద్దేశించి కంగనా రనౌత్ సోషల్ మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ''జెన్ జీ నిరసనకారుల రీల్స్ వాంతులు తెప్పించేలా ఉన్నాయి. వారు మాట్లాడే విధానం, వాడే భాష నేనెప్పుడూ చూడలేదు. యువత స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోంది. వీరు చదువుల్లోనూ రాణించలేరు. వీళ్ల వల్ల సమాజానికి ఎలాంటి ఉపయోగం లేదు'' అని కంగనా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ఇటీవల తీవ్ర దుమారం రేపాయి.

# 'టాక్సిక్'.. గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్!

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ఆగస్టు 8న బెంగళూరులో ఈ ఈవెంట్ జరగనున్నట్లు తెలుస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది.

**ఇదో ఎమోషనల్ స్టోరీ: యశ్**

ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.





# ఆషిక ఆశలన్నీ విశ్వంభర పైనే!



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'పై నటి ఆషిక రంగనాథ్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న ఆమె.. ఈ చిత్రం తన తెలుగు కెరీర్‌లో మరో మలుపుగా నిలుస్తుందని భావిస్తోంది. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆషిక రెండో కథానాయికగా కనిపించనుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయినా.. పలు కారణాలతో విడుదల ఆలస్యమవుతోంది. కన్నడ చిత్రం 'క్రేజీ బాయ్'తో సినీ ప్రయాణం ప్రారంభించిన ఆషిక.. 'రాంబో 2', 'మధగజ' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో నాగార్జున, నాగచైతన్య నటించిన 'బంగార్రాజు'తో అడుగుపెట్టిన ఆమె.. 'అమిగోస్', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాల్లోనూ నటించింది. చిరంజీవి వంటి అగ్ర కథానాయకుడితో కలిసి నటించే అవకాశం ఆషిక కెరీర్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 'విశ్వంభర' విజయం సాధిస్తే టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు అందుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్తీ సరసన తమిళ చిత్రం 'సర్దార్ 2'లోనూ నటిస్తున్నది.

## కావ్యకు మరో ఛాన్స్

చాలా రోజుల విరామం తర్వాత కావ్య థాపర్ తెలుగు తెరపై సందడి చేయనుంది. 'నేను రెడీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఆమె.. ఈ సినిమాతో కెరీర్‌లో కొత్త మలుపు కోసం ఎదురుచూస్తోంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన కావ్య, తమిళ చిత్రం 'మార్కెట్ రాజా ఎంబీబీఎస్'తో నటిగా ప్రయాణం ప్రారంభించింది. తెలుగులో 'ఏక్ మినీ కథ'తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. అనంతరం రవితేజ 'ఈగల్', గోపీచంద్ 'విశ్వం' చిత్రాల్లో నటించింది. అయితే, ఇప్పటి వరకు ఆమెకు స్టార్ హీరోయిన్ స్థాయిలో నిలబెట్టే విజయం దక్క లేదు. దీంతో 'నేను రెడీ'పై కావ్య ఆశలు పెట్టుకుంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హవిష్ హీరోగా నటిస్తున్నాడు. నటి నర్గిస్ ఫక్రి ప్రత్యేక పాత్రలో కనిపిం చనుంది. ఈ మూవీపై భారీ ఆశలు పెట్టుకుంది.



## కామన్వెల్త్ వేదికపై మానుషి

మాజీ మిస్ వరల్డ్, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్‌కు మరో అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇచ్చే అవకాశం లభించింది. గ్లాస్గో 2026 కామన్వెల్త్ గేమ్స్ హ్యాండోవర్ వేడుకలో ఆమె ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఏకైక భారతీయ నటిగా మానుషి నిలవనుంది. ఆగస్టు 2న గ్లాస్గోలోని ఓవీఓ హైడ్రోలో ఈ కార్యక్రమం జరగనుంది. కామన్వెల్త్ గేమ్స్ ముగింపు వేడుకలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్లాస్గో 2026 నుంచి అహ్మదాబాద్ 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు బాధ్యతల బదిలీని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వ హించనున్నారు. 2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న మానుషి.. 2022లో సామ్రాట్ పృథ్వీరాజ్ చిత్రంతో బాలీవుడ్‌లో కథానాయికగా అరంగేట్రం చేసింది. తెలుగులో ఆపరేషన్ వాలంటైన్ చి త్రంలోనూ నటించింది.

## ఆదర్శ కుటుంబంలో యువినా

విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఏకే47) నుంచి చిత్రబృందం మరో పాత్రను పరిచయం చేసింది. వెంకటేశ్ కూతురు 'సంపూర్ణ' పాత్రలో యువినా పార్థవి నటిస్తోంది. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో తండ్రి చిట్టిబాబు (వెంకటేశ్) తో ఆమె మధ్య సాగే సరదా సంభాషణ ఆకట్టుకుంటోంది. "నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను" అని చెప్పగా.. "ఈసారి కార్ డ్రైవర్‌తోనా.. మెకానిక్‌తోనా?" అని వెంకటేశ్ చెప్పే డైలాగ్ నవ్వుల పువ్వులు పూయించింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ తదితరులు నటిస్తుండగా.. ఈ ఏడాది అక్టోబర్ 2న విడుదల చేయనున్నారు. యువినా బాలనటిగా కెరీర్‌ను మొదలుపెట్టింది. 2013లో తిరుమతి తమిళ్ మూవీతో బాలనటిగా కెరీర్‌ను మొదలుపెట్టింది. ఆ తర్వాత అజిత్‌కుమార్, విజయ్, సూర్య, శివ కార్తికేయన్, విశాల్, జయం రవి తదితర హీరోల సినిమాల్లో బాలనటిగా నటించి మెప్పించింది.



యువినా పార్థవి



## మాళవిక కొత్త కోరిక!

సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు, రచయితల సంఖ్య పెరిగితేనే హీరోయిన్లకు మరింత బలమైన పాత్రలు వస్తాయని నటి మాళవిక మోహనన్ అభిప్రాయపడింది. తెరపై మహిళా పాత్రల రూపకల్పనలో మార్పు రావాలంటే ఫీమేల్ గేజ్ మరింతగా ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. హాలీవుడ్ చిత్రం కిల్ బిల్ తరహా యాక్షన్ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించాలని ఉందని తన కోరికను వెల్లడించింది. 'సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు, రచయితలు చాలా తక్కువ మంది ఉన్నారు. వారిని వేళ్లపై లెక్కపెట్టవచ్చు. సినిమాల్లో మహిళల దృష్టికోణం మరింత బలంగా ప్రతిబింబించాలి. మహిళా దర్శకుల సంఖ్య పెరిగితేనే హీరోయిన్ల కోసం అద్భుతమైన యాక్షన్ పాత్రలు, భిన్నమైన కథలు పుట్టుకొస్తాయి' అని మాళవిక పేర్కొంది. ప్రస్తుతం తమిళంలో సర్దార్ 2, పాకెట్ నావల్ చిత్రాల్లో నటిస్తోంది. తెలుగులో రవితేజ–శ్రీవిష్ణు కాంబోలో రానున్న మల్టిస్టారర్‌లో మాస్ మహరాజ్‌తో జతకట్టనున్నది.

## సినిమా

### రేపే 'స్పైడర్ మ్యాన్' ఆగమనం..

# వసూళ్ల విధ్వంసానికి సిద్ధం!



హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' రాకకు సమయం ఆసన్నమైంది. భారత్‌లో ఈ చిత్రం జులై 30న(గురువారం) రిలీజ్ కానుంది. టామ్ హాలండ్ హీరోగా నటించిన ఈ మూవీ విడుదలకు ముందే రికార్డుల మోత మోగిస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తుండడంతో ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. భారత్‌లో హాలీవుడ్ చిత్రాలకు, ముఖ్యంగా స్పైడర్ మ్యాన్ సిరీస్‌కు విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఈ క్రేజ్‌తోనే ఈ సినిమా భారీ వసూళ్లు సాధించే దిశగా దూసుకెళ్తోంది. భారత్‌లో తొలిరోజే రూ.40 కోట్ల కలెక్షన్లు రాబట్టనుందని ట్రేడ్ వర్గాల అంచనా. గ్రాస్ వసూళ్లు రూ.50 కోట్లు దాటొచ్చని తెలుస్తోంది. గతంలో 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' రూ.32.67 కోట్ల ఓపెనింగ్ సాధించి రికార్డు సృష్టించింది. తాజాగా ఈ సినిమాతో అది బద్దలు కావడం ఖాయంగా కనిపిస్తోంది. నాలుగు రోజుల వారాంతంలో ఈ చిత్రం ఏకంగా రూ.120 నుంచి రూ.130 కోట్లు వసూలు చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అంచనాలు నిజమైతే, క్రిస్టోఫర్ నోలన్ తాజా చిత్రం 'ది ఒడిస్సీ' రికార్డులను కూడా ఇది అధిగమించనుంది. చైనా బాక్సాఫీస్ వద్ద కూడా ఈ మూవీ కలెక్షన్ల సునామీ సృష్టించనుంది. తొలిరోజే చైనాలో 35 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధిస్తుందని అంచనా. ఫుల్ రన్‌లో 250 మిలియన్ డాలర్లు కూడా రాబట్టే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. 2021లో వచ్చిన 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' కొన్ని కారణాల వల్ల చైనాలో విడుదల కాలేదు. దీంతో అప్పటినుంచి ఈ సినిమా కోసం అక్కడి మార్వెల్ అభిమానులంతా ఎదురుచూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఓపెనింగ్ వీకెండ్‌లో ఏకంగా 465 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,900 కోట్లు) వసూళ్లను లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే జరిగితే, సోనీ పిక్చర్స్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన రెండో చిత్రంగా ఇది నిలుస్తుంది. 'నో వే హోమ్' 600.5 మిలియన్ డాలర్ల (సుమారు 5,735 కోట్లు)తో మొదటి స్థానంలో ఉంది.

ఇక, మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది 38వ చిత్రం కాగా.. 'స్పైడర్ మ్యాన్' సిరీస్‌లో నాలుగో భాగం. ఈ చిత్రంలో టామ్ హాలెండ్ సరసన జెండాయా కథానాయకిగా నటిస్తున్నారు. వీరితో పాటు సేడీ సింక్, జాకబ్ బాటలాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.